


# జవరాండ్ర చిత్రముల్

రచన:
"రాజ్మయశ్రీ"

ఆదివారం కదా అన్న ధీమాతో ప్రొద్దెక్కినా లేవకుండా పడుక్కొని తియ్యటికలలు కంటున్నాను.

"ఏమండీ ... మిమ్మల్నేనండీ ... లేవండి" అన్నమాటలతో కూడిన కుదుపుతో, కల్పనాజగత్తులోనుండి బాహ్యజగత్తుకొచ్చిపడ్డాను. కళ్ళునులుముకు చూస్తే నా శ్రీమతి ఓ కాగితం పట్టుకు కనిపించింది. 'అదేమిటి చెప్మా' అని అనుకొనేలోపునే—

"ఇదిగో ఇది చూసేరా? ఇందండి" అంటూ చేతిలో పెట్టిందా కాగితాన్ని.

కందిపప్పు 6 శేర్లు
శనగపప్పు 4 శేర్లు
,, పిండి 8 శేర్లు
(డిటో పిండి అంటే ఏమిటో అనుకొనేరు. శనగపిండి అని మాశ్రీమతి భావం లెండి)

...అలాగే అన్నివస్తువుల కొలతలతో ఓపేజీ పూర్తిగా వ్రాసివుంది. అది సగం చదివేసరికి నిద్రమత్తు అంతా పూర్తిగా వదలి, చివరదాకా చదివి—

"బాగుంది, బాగానే రాసేవు ఇంద" అంటూ శ్రీమతి చేతికిచ్చివేసేను.

"బాగుందేమిటండీ! అంతా పూర్తిగా చదివేరా? ఈలిస్టేమిటో పోల్చుకోండి!"

"ఆ — ఎవరి యింట్లోనో పెళ్లికి ఏ ఏ సామాన్లు ఎంతెంత కొనాలో తెలియక నిన్నడిగివుంటారు. అవన్నీ కొలతలతో సహా రాసేవు."

"సరిసరి! ఇదా మీరు పోల్చింది; ఎవరిపెళ్ళిదో మనకెందుకు..."

"అయితే మన పెళ్ళిదే సరదాకి రాసేవు కాబోలు"

"అయినా మీ వేళాకోళాలకి వేళా పాళా లేనట్టుంది. ఎప్పటివో పాత సంగతులన్నీ ఇప్పుడెందుకండీ అన్నట్టు రేపేకదూ ఒకటో తారీకు."

"అయితే ఇది ఈనెలసరి సామాన్ల జాబితా ఏమిటి కొంపతీసి"

"ఏదీ పూర్తిగా వినరుకదా! ఎల్లుండి మన 'బాసు'గాడి పుట్టినదినం కదా ? ఈ పుట్టినదినంతో రెండేళ్ళు నిండుతాయి. వచ్చే యేడు వాడి పుట్టినదినం చేస్తామా ఏమైనా. అందుకే ఈ యేడు మనవాళ్లందర్నీ పిలిచి పండుగలా గొప్పగా చేద్దామని"

"చంపేవుపో...ఎంత కంగారుపెట్టేసేవు. పెళ్లికి సరిపోయేటంత లిస్టురాస్తే మీ చెల్లెలుకి గాజులుపెట్టించే అవుసరం కలిగి, పెళ్లిచేసినంత వైభవంగా చేస్తారేమోనని అనుమానపడ్డాను"

"మీ అనుమానాలకేమి గాని, నాలుగేళ్లయి కాపురంచేస్తున్నా పిల్లలు కలగ లేదనేకదూ, దాన్నంత ఎకతాళిచేస్తారు. నవ్విన ఊళ్ళే పట్నాలవుతాయి. ఐనా మీరు దాన్నంత చులకనగా చూస్తే మాత్రం నే నొప్పుకోను సుమండీ!"

"ఎంతమాట. నిన్నూ, మీ చెల్లెల్నీ చులకనగా చూడ్డమే. నిప్పులాంటివారు కదూ మీరు,"

"నిజమే...కాకుంటే, కేంపులమీద పది, పదిహేనురోజులు మా మరిది వెళిపోయినా, సంవత్సరం పొడుగునా తీర్థయాత్రలకని వాళ్ళ అత్తగారు వెళిపోయినా, అంత యింట్లోను, మరో పిట్టయినా సాయంలేకుండా చిన్నపిల్లయినా మచ్చతెచ్చుకోకుండా, ఈ నాలుగేళ్లయి ఉన్నాదంటే నిప్పులాంటిమనిషి కాబట్టే ఉండగలిగింది"

"అఁ కాకేమి, మీ చెల్లి కఱ్ఱబొగ్గు నిప్పయితే, నువ్వు బాగా రాజుకున్న రాకాసి బొగ్గునిప్పువి."

"నిప్పుల సంగతికేమిటి గాని, ఈ పప్పులలిస్టు సంగతి చూడండి."

"ఇంతకి ఎవర్ని పిలుస్తావని ఇంత యత్నం" అన్నాను పక్కమీదనుండి లేస్తూ.

"ఎవర్నేమిటి, మాచెల్లెలు సుధనీ"

"బంధుమిత్రులతో సహా నా" అన్నా మధ్యలో.

"ఏమి ఇదండీ...మహావాళ్ళున్నదే ముగ్గురు. దాంట్లో మా మరది కేంపు వెళిపోయేడు. దాని అత్తగారికి మడి, తడి అని ఆవిడ రాదు ఇంక వచ్చేది మా చెల్లెలొక్కర్తే కదూ?"

"ఓహో! అలాగా ఇంకెవర్ని పిలుస్తావు"

"ఇంకెవళ్లున్నారు, ఇరుగు పొరుగు వాళ్లని నాతో చదువుకున్న విమల, శ్యామల, కాంతం, పద్మ..."

"ఆపు, ఆపు, ఎంతకి నీ స్నేహితురాళ్లమాటేకాని, నాస్నేహితులని పిలవ కూడదేమిటి?"

"తప్పకుండా పిలవండి! నేను వద్దన్నానా ? అంతో ఇంతో గౌరవమైన ఉద్యోగం చేస్తున్నారాయెను. అన్నట్టు మరిచిపోయేను. అగ్రహారం వీధిలో, వరసపెట్టి పిలుస్తారే, శేషమ్మత్తని, ఆవిడనీ ఆవిడ కూతురునీ సాయానికి రమ్మంటాను."

ఏమిటీ! మా శేషమ్మత్త కూతురు మాణిక్యం వచ్చిందా? పాపం కట్నం యిచ్చుకోలేక మా శేషమ్మత్త దాన్నో రెండో పెళ్ళివాడికి కట్టబెట్టింది. పదహారేళ్ళేనా దాటని ఆ పిల్లకుంక ఎంత అవస్థపడుతున్నాదో ఆ ముసిలిమొగుడితో కాపరంచెయ్యలేక..."

"అట్టే దయ ఒలకపోసీకండి మీ మాణిక్యంమీద. ముందు ఈ లిస్టులో సామాన్లు రామన్నతోచెప్పితెప్పించండి" అంటూ కాఫీ తేవడానికి లోపలికి వెళిపోయింది శ్రీమతి.

* * *

అనాడు ఉదయం నిద్రలేచేసరికి, ఎదురుగా కాఫీకప్పు చేతిలో పట్టుకొని మాణిక్యం కనిపించింది. కిటికీలో నుండిపడే లేయెండలో మాణిక్యంలా మెరిసిపోతున్నాది. పచ్చటిబంగారులాంటి మేనిఛాయ, నల్లటి తుమ్మెద రెక్కల్లాంటి ముంగురులు, ముద్దొచ్చే ఆ అమాయకపు ముఖం చూస్తుంటే, నిజంగా బ్రహ్మదేవుడు నిర్దయుడనక తప్పదు. లేకుంటే మాణిక్యంలాంటి మాణిక్యానికి, మసిబొగ్గులాంటి మొరటు మొగుణ్ని జతపర్చడమేమిటి.

"ఇందండి...బావగారికి లేస్తూ కాఫీ ఉండాలటగా తీసుకోండి" అంటూ నా మంచందగ్గరగా వచ్చింది మాణిక్యం.

నేను మాణిక్యాన్ని పెళ్ళి అయిన తరువాత చూడ్డం ఇదే మొదటిపర్యాయమైనా తను పూర్వంలాగే చనువుగా మాట్లాడుతోంటే నాలో నేనే ఆశ్చర్యపోయేను. అందిస్తున్న కాఫీని తీసుకోకుండా చెయ్యిపట్టుకొని, "కాఫీ కేం తొందర, ఇలా రా కూర్చో" అన్నాను.

"మనసా" కూర్చుందామని ఉన్నా "వాచా" "వద్దుబావా! ఎవరైనాచూస్తే బాగుండదు" అంటూ "కర్మణా" నా ప్రక్కను వచ్చికూర్చుంది మాణిక్యం.

సరిగా ఆ సమయానికే, ఏదో పని మీద వచ్చినట్టు మా మరదలు సుధ, గదిలోకి తొంగిచూచి వెంటనే వెళిపోయింది.

"చెప్తే విన్నావా బావా! సుధ చూచింది మనల్ని. ఇంకపోతాను నాకు చాలా పనులున్నాయి" అంటూ కాఫీ అక్కడ పెట్టేసింది.

"నీతో మాట్లాడడానికి మరి వీలు చిక్కదు. మాణిక్యం పోనీ, ఈ సందడంతా అయినతరువాత రాత్రికి ఉండి రేపు వెళ్ళు" అన్నాను. "ఔను కాదు" అన్న జబాబైనా లేకుండా, మాణిక్యం గదివదలి బైటకు వెళిపోయింది.

నేను పక్కమీదనుండి లేచి ముఖం కడుక్కొందికని పెరట్లోకి వెళ్ళబోతూ, వంటింట్లోకి తొంగిచూచేను.

నిజంగా ఏ పెళ్ళిసందడీ దానికి సరిరాదు. ఓ మూలని మా శేషమ్మత్తా, మరెవరో కూర్చొనిలాడూలు చేస్తున్నారు. కొందరు మైసూరుపాకు చెయ్యడానికి సామాన్లు కొలిచివుంచుతున్నారు. మా మరదలు సుధా, మాణిక్యం, అపన్లలో మునిగివున్నారు. ఇంత మా శ్రీమతికి, తీరకోసిన నక్కలా, ఏ పని చెయ్యకపోయినా, వంటింట్లోకీ, నట్టింట్లోకీ అనవసరంగా తిరిగే సరికే సరిపోతున్నాది; (దాన్నే అజమాయిషీ అంటారు లెండి పెద్దలు)

ఆ సంరంభమంతా చూచి, విస్తుపోయి, మా శేషమ్మత్తని పలకరిద్దామన్న సంగతే మరిచిపోయి, మా మరదలు సుధని కుశలప్రశ్నలు వేయవలసిన సంగతే జ్ఞాపంరాక, అక్కరలేక



పోయినా పదిమాట్లు, అన్నిగదుల్లోదూరి బయటకువస్తూ కాళ్లు అరగగొట్టుకొనే మా శ్రీమతిగారి సంగతైనా తెలిసికోకుండా, పళ్లు తోముకుందికి పెరటివైపు వెళిపోయేను.

* * *

రెండు గంటలు శలవు పెడితే చాలన్నా వినకుండా, ఆరోజు పూర్తిగా శలవుపెట్టీమని బలవంతపెట్టింది మా శ్రీమతి. తొమ్మిదింటికల్లా రావలసిన

బంధుమిత్రులందరూ వచ్చిసేరు. మా 'బాసు'గాడికి తలంటి నీళ్లుపోసి తిలకం దిద్ది కొత్తబట్టలు తొడిగేరు. ముత్తైదువులు కొందరు పాటలుపాడి హారతి యిచ్చేరు. ఈ పనులన్నీ సుధా, మాణిక్యాలే చూచుకొంటున్నారు. మా అవిడ పనేమిటో మీకు ముందే చెప్పేను కదూ అజమాయిషీ అని.

మా అవిడ అజమాయిషీ ధర్మమా అని పన్నెండింటికల్లా భోజనాలయిపోయేయి. ఆరోజు మామాణిక్యం ఎంత చురుగ్గా పనిచేసిందో చెప్పతరంకాదు.

సుష్టుగా భోజనంచేసి భుక్తాయాసం తీర్చుకుందామనుకొనేసరికి, మాశ్రీమతి వచ్చి, పడుకోబోతున్న నన్ను చెయ్యి పట్టుకులేవదీసి, "బాగుందండీ! ఉన్న దొక్కగదే ఆయను, మీ రిక్కడ పడుక్కుంటే ఎలా? ఇంక పేరంటాళ్ళు వచ్చే వేళయింది. చాల రోజులై ఏ సినిమా చూళ్ళేదు. అలా ఏ మేట్నీకైనా వెళ్ళిరండి" అతి అప్యాయంగా లేని అభిమానం వలకబోస్తూ అంది.

ఎప్పుడైనా తనని సినిమాకి తీసుకు వెళ్ళకుండా నే నొక్కడినే వెళ్లవలసి వచ్చివెళితే, రాద్ధాంత సిద్ధాంతం చేసి మూడు రోజులైనా అలకపాన్పు వీడని మా శ్రీమతి తనంతతానే సినిమాకి వెళ్లమని బలవంతం చెయ్యడంలో ఉద్దేశమేమిటో మీకు సుళువుగానే బోధపడిందనుకుంటాను.

"విఘ్నేశ్వరుడిమీద భక్తా, ఉండ్రాళ్ళమీద భక్తా"...అని.

"దేనిమీదో ఒకదానిమీద. సామెతలు పాడవకండి బాబూ...నాకు పనుంది" అంటూ అక్కడనుండి వెళిపోయింది.

* * *

మేట్నీకి వెళ్లి, స్నేహితులతో బాతాఖానీకొట్టి ఇంటికిచేరేసరికి, రాత్రి తొమ్మిదయింది. అందరూ, రోజల్లా అలిసి వున్నారేమో, వొళ్ళు తెలియకుండా పడుక్కున్నారు, ఎక్కడ వాళ్ళక్కడ ఊడబోయిన కళాసుల్లా. జోళ్ళచప్పుడు విని శ్రీమతిమాత్రం లేచి వంటింట్లోకి వెళ్ళింది నాకు అన్నంపెట్టడానికని.

చేతిమీద నెయ్యివేస్తుంటే అడిగేను "అందరూ వెళిపోయేరా" అని.

"మా చెల్లీ, మీ మాణిక్యం తప్ప" అన్నాది ముక్తసరిగా.

"మాణిక్యం ఉండిపోయిందా" అన్నాను నేరక.

"ఏం నంగనాచులండీ! మీరే ఈ రాత్రికి ఉండి వెళ్లవచ్చని అన్నారట మీ మాణిక్యంతో.

"అవును, పాపం బొంగరంలా తిరిగి పనిచేసింది...అందుకు రాత్రి విశ్రాంతి తీసుకువెళ్ళమన్నాను."

"మీ పక్కమీద తీసుకుంటుందా విశ్రాంతి" అంది బైటపడబోయే కోపాన్ని అణచిపెట్టడానికి ప్రయత్నిస్తూ.

"ప్రతీదానికి అనుమానపడే నీగుణం మాత్రం పోనిచ్చుకున్నావుకావు."

"నాదేకదూ అనుమానపడే గుణం. పాపం మీరు చేసినవేమీ కనిపించవు. ప్రొద్దున్న మీ మంచంమీద మీ మాణిక్యాన్ని" అని ఇంకా ఏమో అనబోతున్నదల్లా అప్పుడే వంటింట్లో కాలుపెడుతున్న సుధను చూచి ఆగిపోయింది.

అదే అదనని వేగం భోజనం పూర్తి చేసుకొని లేచిపోయేను.

గదిలో చాపమీద పడుకొని చిత్రగుప్త చదువుకుంటున్నాను. మాణిక్యం ఆంధ్రప్రభ చదువుతోంది.

"నువ్వు భోజనానికి వెళ్ళలేదేం" అని అడిగేను మాణిక్యాన్ని.

"ఆకలిలేదు ... మధ్యాహ్నం ఆలస్యంగా భోజనాలయేయి మావి. రానని చెప్పేసేను సుధ అడుగుతే!"

"అభ్యంతరం లేకపోతే తములపాకులు రాసియిస్తావేమిటి?" అని అడిగేను.

తములపాకుసజ్జా తెచ్చి, నా తల వైపు కూర్చుని, ఆకులకు సున్నంరాసి, ఈనెలుతీసి, ఆకును మధ్యకు మడిచి రెండుగా చీరి చెక్కలగుండ వేసి యిచ్చింది.

"మీ ఆయనకీ అలవాటుంది కాబోలు. అందుకే ఇంత సున్నితంగా ఈనెలుకూడ తియ్యడం చాతనయింది"

"ఈ బ్రతుక్కి అదొక్కటేతక్కువ, ఆయనగారూ, ఆకులు చీరడమూను."

"ఏం, అలాగన్నావు, మీ అయనగారికి ఆకులువేసుకోడం అలవాటులేదు కాబోలు, పోనీ నన్ను నమిలి, నీకు తమ్మి యివ్వమన్నావేమిటి" అన్నాను.

అప్పటివరకూ సరదాగా మాట్లాడుతున్నదల్లా వెంటనే చిన్న బుచ్చుకున్నదానిలా గొంతుమార్చి అంది.

"మానిన గాయాన్ని మళ్లీ ఎందుకు కెలుకుతావు బావా? ఆపాటి అదృష్టం కూడానా యీ దరిద్రపు ముఖానికి. నేనుకూడా ధనవంతుల బిడ్డనైతే! ఇప్పటి మా అక్కస్థానంలో నేను ఉండకపోయేదాన్నా. బీదదాన్నని, నీ పెద్దచదువులకి డబ్బుపెట్టలేమనే కదా, చిన్నప్పటి మన స్నేహాన్నికూడా మరిచిపోయి, ఈ సంబంధంచేసుకున్నావు. "పిల్లికి చెలగాటమూ, ఎలుకకు ప్రాణసంకటమూ అన్న సామెతలా వుంది నా పరిస్థితి నీకళ్లకు" అంటూ బేలలా కన్నీరు కార్చడం మొదలుపెట్టింది.

అనుకోని యీ సంఘటనను ఎలా ఎదుర్కోవాలో తెలిసిందికాదు. అనవసరంగా ఒక అమాయకురాలి మనస్సు నొప్పించేను కదా అన్న భావం నాలో పనిచెయ్యసాగింది. చటాలున లేచి వెళ్లి మాణిక్యం రెండు చేతులూ పట్టుకు లేవదీసి, గుండెలకత్తుకొని "పిచ్చిపిల్లా ఏదో సరదాకి నేనంటే నువ్విలా పట్టించుకుంటావనుకోలేదు..." అని ఇంకా ఏమో అంటున్నాను, ఇంతలో మా

శ్రీమతిమాట లనబడే పిడుగుల వర్షం నామీద హఠాత్తుగా కురిసింది.

"నాది అనుమానపుగుణం, పాపం మీరే మచ్చలేని మనుష్యులు. రోజల్లా అలసిపోయిందని సేద తీరుస్తున్నారు కాబోలు దగ్గరకు తీసుకొని, అయినా మిమ్మల్నన్న పనిలేదు. పెళ్లయినా పరాయిమొగవాడిదగ్గర అంతలా కులికే ఆ దౌర్భాగ్యురాలి ననాలి. అలాంటి దాన్ని ఒక్కనిమిషం నాయింట్లో ఉండనివ్వను. వెంటనే దాన్ని వాళ్లింటికి పంపించీయండి" అంది కోపంతో రొప్పుతూ.

అర్ధరాత్రి ఎందుకు రేపు ఉదయం దిగపెట్టివేస్తానని మా శ్రీమతిని ఒప్పిద్దామనుకున్నా, మాణిక్యంమాత్రం ఉండనని పట్టుబట్టింది. ఇంక చేసేదిలేక చొక్కావేసుకు బయలుదేరేను మాణిక్యాన్ని దిగపెట్టడానికని—

మాణిక్యాన్ని దిగపెట్టి ఇంటికిచేరి తలుపు కొట్టేసరికి పన్నెండయింది తలుపుతీస్తూ, శ్రీమతి పక్కకుతప్పుకొని, "నేను ఇంట్లోకి రాను. మీరు వెళ్లి పడుకోండి" అంది.

అప్పటికే ముంచుకువస్తున్న నిద్దరతో కళ్ళుమూసుకుపోతుంటే అలాగే వెళ్లి మంచంమీద కూలబడిపోయేను. తెల్లవారడానికి ఇంకా రెండు గంటలుంటుందనగా, నాకు అకస్మాత్తుగా తెలివివచ్చింది. లేవబోతే సాధ్యపడలేదు. రెండుచేతులు మెడచుట్టు పెనవేసివున్నాయి. ఎవరైందీ నా ఊహకందలేదు. బైటనున్న శ్రీమతికాదు. పోనీ మా మరదలు సుధా, అంటే... అలాంటి అవినీతిపనికి చచ్చినా ఒప్పుకొనే రకమన్నసంగతిపై నాకు పూర్తి నమ్మకముంది. ఇంక ఎవరో తెలుసుకుందామని లైటు వెయ్యడానికి చెయ్యి ఎత్తబోతుంటే, ఎత్తినచేతిని అడ్డుతూ ఓ చిన్నగొంతుక వినిపించింది; "లైటు వెయ్యకు బావా? నేనేను" అంటూ నా చెవులని నేనే నమ్మలేకపోయేను. నీతిమంతురాలు సుధ ఇంత అధోగతికి వచ్చిందంటే నమ్మలేకపోయేను.

"నువ్వేనా సుధా! అయినా నీ యీ ప్రవర్తనకి ఉద్దేశ మేమిటో బోధపడకుండావుంది నాకున్న సందేహమల్లా" అని ఏమో అనబోతుంటే—

"నీ సందేహాలన్నిటికి తాపీగా సమాధానాలిస్తాను. ఇప్పుడుమాత్రం వాట్ల జోలికి పోకు" అంటూ నా జుత్తులోకి వేళ్ళుపోనిచ్చి దగ్గరగా తీసుకుంటూ తన పెదవులతో నానోరు మూసివేసింది.

మానవుని జీవితంలో అనుకోని మధురక్షణాలు ఏ కొద్దిగానో వస్తాయి. అలాంటి వెలలేని కాలాన్ని, సందేహాలు పెట్టుకొని వ్యర్థపుచ్చడంకంటె తెలివి తక్కువ ఇంకొకటి లేదు. అందుకనే సుధని గాఢంగా కౌగలించుకొన్నాను.

మాశ్రీమతికి రాత్రిసంఘటన తెలియకుండా కాపాడుకుందికని, అతి తగు మనిషిలా రోజల్లా ప్రవర్తించేను.

వేటరుచిమరిగిన పులి మాటువేసుకు కూర్చున్నట్టు, ఆరాత్రి పనులన్నీ ఎంత వేగం పూర్తిచేసుకు వస్తుందా మాసుధ అని కాచుకుకూర్చున్నాను.

పని పూర్తిచేసుకు వచ్చిన సుధని "ఇంత నేరజాణవని ఇప్పటిదాకా తెలీదు సుధా" అన్నాను

"నువ్వుమాత్రం తక్కువ తిన్నావా? బావా" అంది సుధ.

"అదిసరేగాని, నిన్న నా సందేహం తీరుస్తానన్నావు అసలదేమిటో తెలుసా" అన్నాను.

"తెలియకేమి? ఇంతలా ఎందుకు దిగజారేనా! అనేకదూ నీ సందేహం. దానికి నా భర్తే కారణం. కేంపులమిష ఊర్లంట తిరుగుళ్లుతిరగడం, పెళ్లయి నాలుగేళ్లయినా పిల్లలు కలుగకపోవడానికి కారణం నాభర్తే. నా బాధంతా మా అక్కతో చెప్పుతుంటే మా అక్కే నాకీ సంఘటన కలిపించింది.

"ఏమిటీ! మన యీ సంగతంతా మీ అక్కచేతిమీదుగా జరిపినదేనన్న మాట" అన్నా ఆశ్చర్యం పట్టలేక.

"అవును బావా! పరువుప్రతిష్ఠలు వీధికెక్కేపనులు చేసేకంటే యీ ఉపాయమే బాగుందని మా అక్క నాకీ సాయంచేసింది."

"మరి అయితే! తనంతతానే నాకీ అవకాశం కలిపించిన మీ అక్క, నేను మాణిక్యంతో మాట్లాడితేనే అంత సహించలేకపోయిందేం?" అన్నా సుధతో.

"ఉరకలు పరుగులతో పొంగివచ్చే పంటకాలువను, తనకు కావలసిన భూములగుండా ప్రవహింపచేసుకోకుండా, పరులభూములపైకి వదలివేసే తెలివితక్కువ ఎవరికుంటుంది బావా" అంది సుధ.

మరునాడురాత్రి ఆఫీసునుండి ఇంటికివచ్చేసరికి, మా శ్రీమతి చెప్పింది. సుధభర్త కేంపునుండి వచ్చేసేడనీ, అందుకు పండిపెట్టి వెళిపోయిందనీ. రాత్రి భోజనాలైన తరువాత మా శ్రీమతి దగ్గరకు వెళ్ళి, చెయ్యిపట్టుకొని "ఇంక నీ నాటకం చాలించు. నాందీ ప్రస్తావనలు చాల అద్భుతంగా జరిపించేవు. ఇంక కథానాయకుడు రంగస్థలం ప్రవేశించడానికి చాలవేళవుంది పద మనం పోయి గదిలో పడుక్కుందాం" అన్నాను.

"అరే! ఇదేమిటి వాకటున్నదాన్ని ముట్టుకుంటున్నారు. మీ రన్నదేమిటో బోధపడలేదు" అంది ఏమీ తెలియని దానిలా.

"ఇప్పుడు నీకేం బోధపడదు. బారసాల పీటలమీద, మీచెల్లి, ఓ 'బాసు' గాడ్ని ఎత్తుకు కూర్చుంటే బోధపడుతుంది నీకు."

"అబ్బ, ఎంత ప్రతాపవంతులండీ!" అంది చాపచుట్టివేస్తూ.

"నువ్వుకావూ! త్యాగవంతురాలవు"

ఇద్దరంకలిసి గదిలోకి వెళిపోతుంటే, నాకుమాత్రం, మాశ్రీమతిసంగతి తల్చుకుంటే, "...క్షణ క్షణముల్, జవరాండ్రచిత్తముల్" అన్న పద్యపాదం జ్ఞాపకం వచ్చింది. ★